క్లుప్తంగా

చురుగ్గా ప్రహరీ నిర్మాణ పనులు



సీడీపీఓ కార్యాలయం చుట్టు నిర్మిస్తున్న ప్రహరీ

బాడంగి: మండల కేంద్రంలోని చైల్డ్ డెవలంప్‌మెంట్ ప్రాగ్రాం ఆఫీస్ చుట్టు ప్రహరీ నిర్మాణ పనులు చురుకుగా సాగుతున్నాయి. రెండేళ్ల క్రితం భవన నిర్మాణం జరిగినప్పటికీ ఇంతవరకు కార్యాలయం చుట్టూ ప్రహరీ, రోడ్డు నిర్మించలేదు. ఈ విషయాన్ని పీఓ కె.రాజ్యలక్ష్మి ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే చొరవతో ప్రభుత్వం ఏఎంసీ నిధుల నుంచి సుమారు రూ.10 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ప్రహరీ నిర్మాణ పనులు చేపడుతున్నారు. అలాగే గ్రామ శివారులో ఉన్న అంగన్‌వాడీ కేంద్రం చుట్టూ ప్రహరీ, సీసీరోడ్డు నిర్మాణానికి ఉపాధి నిధులు రూ.10 లక్షలు మంజూరయ్యాయి. త్వరలోనే పనులు చేపట్టనున్నారు.

రబీ సాగు వివరాల సేకరణ



గ్రామాల వారీగా రైతుల సర్వే నంబర్లు సేకరిస్తున్న ఏఓ శిరీష

బాడంగి: మండలంలో రబీ పంటల సాగుపై పూర్తి సమాచారం సేకరిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారి కె.శిరీష తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. రైతుభరోసా కేంద్రాల వారీగా రబీపంటలు సాగుచేస్తున్న రైతుల వివరాలు, సర్వే నంబర్లు వారీగా సేకరించి ఈ–క్రాప్‌లో నమోదు చేయనున్నట్లు చెప్పారు. చిరుధాన్యాల సాగుపై రైతులు దృష్టిసారించాలని సూచించారు. వీఏఏ ఎం.జయలక్ష్మి పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు



గొర్రెలు, మేకలకు వ్యాక్సిన్లు వేస్తున్న వెటర్నరీ అసిస్టెంట్లు

తెర్లాం: గొర్రెలకు, మేకలకు చీడపారుడు వ్యాధి సోకకుండా ఉండేందుకు పీపీఆర్ వ్యాక్సిన్‌ను వేయించాలని మండల పశువైద్యాధికారి జె.నరేంద్రకుమార్ అన్నారు. మండలంలోని నందిగాం గ్రామంలో గొర్రెలు, మేకలకు బుధవారం వ్యాక్సిన్లు వేశారు. ఈ సందర్భంగా చీడపారుడు వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై గొర్రెలు, మేకల పెంపకందారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్నిపల్లి గంగ, ఎంపీటీసీ ప్రతినిధి అల్లు లక్ష్మణరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు సిరిపురం విద్యార్థిని



మేఘనను అభినందిస్తున్న హెచ్‌ఎం, సిబ్బంది

సంతకవిటి: మండలంలోని సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న విద్యార్థిని జి.మేఘన రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. విజయవాడలో గురువారం జరిగే అండర్–17 విభాగంలో స్విమ్మింగ్ పోటీలో పాల్గొనున్నట్లు హెచ్‌ఎం వి.వెంకటరావు చెప్పారు. విద్యార్థినిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

సామాజిక తనిఖీలపై గ్రామసభ



గ్రామసభలో వివరాలు వెల్లడిస్తున్న సోషల్ ఆడిట్ బృందం

రాజాం: మండలంలో బొమ్మినాయుడువలస గ్రామంలో జరిగిన ఉపాధిహామీ పనులపై మూడురోజులుగా చేపట్టిన సామాజిక తనిఖీలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. గ్రామ పంచాయతీలో 16వ సోషల్ ఆడిట్ నిర్వహించినట్లు ఎస్‌ఆర్‌పీ ఎన్.చిన్నబ్బాయి తెలిపారు. పంచాయతీలో 2022–23 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి పనులతో పాటు సంక్షేమ పథకాల నిధుల ఖర్చులకు సంబంధించి 71 వర్కులకు గానూ రూ.36 లక్షలు ఖర్చు చేసినట్లు డీఆర్‌పీ కె.మల్లికార్జునరావు వెల్లడించారు. తనిఖీల్లో తమ దృష్టికి వచ్చిన అక్రమాలను ప్రజలకు వివరించారు. అభ్యంతరాలు సేకరించారు. మండల కేంద్రంలో త్వరలో నిర్వహించే సోషల్ ఆడిట్ ప్రజావేదికలో వీటిని మరోసారి బహిర్గతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ వంజరాపు అన్నపూర్ణమ్మ, విజయ్‌కుమార్, ఏపీఓ సాయిరాం, పంచాయతీ కార్యదర్శి కలిశెట్టి మణికంఠ, టెక్నికల్ అసిస్టెంట్ ఎం.బుచ్చిమ్మ తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి, సంక్షేమం

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



తెర్లాం: సుందరాడలో హెల్త్ వెల్‌నెస్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

తెర్లాం: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని సుందరాడ గ్రామంలో రూ.69.74 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వైఎస్సార్ హెల్త్ వెల్‌నెస్ సెంటర్ భవనాల బుధవారం ఆయన ప్రారంభించారు. అనంతరం స్థానిక సర్పంచ్ అద్దంకి దిలీప్‌కుమార్, మాజీ సర్పంచ్ అద్దంకి వెంకటరావు ఆధ్వర్యంలో నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ.. గ్రామ సచివాలయాల ఏర్పాటుతో ప్రభుత్వ సేవలు ప్రజల చెంతకు చేరాయని, గ్రామ సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆర్‌బీకేల ద్వారా రైతులకు కావాల్సిన అన్ని సేవలను గ్రామస్థాయిలోనే అందిస్తున్నట్లు చెప్పారు. అలాగే హెల్త్ వెల్‌నెస్ కేంద్రాల ఏర్పాటుతో గ్రామీణ ప్రాంతాల్లో నిరంతర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా సంక్షేమ పాలన అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలంతా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నర్సుపల్లి ఉమాలక్ష్మి, వైస్ ఎంపీపీ చేపేన సత్యనారాయణ, జెడ్పీటీసీ ప్రతినిధి గర్భాపు రామారావు, డీసీసీబీ డైరెక్టర్ బోను అప్పలనాయుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తెంటు సత్యంనాయుడు, పీఆర్ డీఈ అప్పారావు, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ డీవీ అప్పారావు, తహసీల్దార్ బి.రత్నకుమార్, పీఆర్ ఏఈ రాజశేఖరరావు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పరిపాలన

రామభద్రపురం: రాష్ట్రాభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలన అందిస్తున్నారని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. కొట్టక్కిలో సుమారు రూ.70 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, వెల్‌నెస్ కేంద్రాన్ని, నాడు–నేడు నిధులు సుమారు రూ.69 లక్షలతో నిర్మించిన అదనపు తరగతి గదులను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాయాలను నిర్మించి ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడంతో పాటు నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందన్నారు. సంక్షేమ పథకాల మంజూరులో పూర్తి పారదర్శకత పాటిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్య, వైద్యం, వ్యవసాయానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్ నిక్షిప్తమై ఉందని, ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, శంబంగి వేణుగోపాలనాయుడు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, అప్పికొండ నిర్మల, హెచ్‌ఎం రావాడ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే జగనన్న లక్ష్యం

● ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు



లబ్ధిదారుకు సంక్షేమ బుక్‌లెట్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

రామభద్రపురం: నవరత్నాలతో ప్రతీ కుటుంబంలో సంతోషం నెలకొందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని కొట్టక్కి గ్రామంలో బుధవారం నిర్వహించిన 'గడపగడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. స్థానిక నాయకులు, అధికారులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. నాలుగున్నరేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. రహదారి సమస్య ఉందని స్థానికులు చెప్పగా.. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న ప్రతీ హామీని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని, సంక్షేమ పథకాల ద్వారా ప్రతీ గడపలో సంతోషాన్ని నింపారని అన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లో మరోసారి జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావు, జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీటీసీ సామిరెడ్డి రమణమ్మ, రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ డబ్ల్యూఎస్ రాయులు, పార్టీ మండల అధ్యక్షుడు అప్పికొండ లక్ష్మునాయుడు, తహసీల్దార్ సులోచనరాణిరావు, ఎంపీడీఓ రమామణి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

రామభద్రపురం: రాష్ట్రంలో ప్రతీ పేదవాడి సొంతింటి కల నెరవేర్చడమే సీఎం జగన్ లక్ష్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. కొట్టక్కిలో 62 మంది పేదలకు బుధవారం ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా ప్రభుత్వం అర్హులైన లబ్ధిదారులకు ఇంటి పట్టాలు ఇవ్వడంతో పాటు ఇంటి నిర్మాణానికి రూ.1.80 లక్షలు ఆర్థిక సాయం అందిస్తోందని తెలిపారు. జగనన్న కాలనీలో లబ్ధిదారులకు అవసరమైన మౌలిక వసతులను ప్రభుత్వం కల్పిస్తుందని చెప్పారు.

హ్యాపీ బర్త్‌డే జగన్ మామయ్యా..



ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తుండడంతో పాటు పేద విద్యార్థుల చదువులకు అండగా ఉంటున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి విద్యార్థులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు. మండలంలోని అలజంగి పాఠశాలలో విద్యార్థులు సీఎం చిత్రపటాలను పట్టుకుని హ్యాపీ బర్త్‌డే జగన్ మామయ్యా.. అంటూ నినాదాలు చేశారు.

– బొబ్బిలి

గోరుముద్ద మెనూ పరిశీలన



గోరుముద్ద భోజనాలను పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రభుత్వ పాఠశాలల్లో అమలు చేస్తున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంఈఓలు జె.త్రినాథరావు, పాపారావు అన్నారు. మండలంలోని జనార్థనవలస పాఠశాలను ఎంఈఓ–1,2లు బుధవారం తనిఖీ చేశారు. విద్యార్థుల, ఉపాధ్యాయుల హాజరును, పాఠశాల రికార్డులను, మరుగుదొడ్లను, జగనన్న గోరుముద్ద పథకం వంటలను, విద్యార్థుల హోంవర్క్ పుస్తకాలు, ఉపాధ్యాయుల లెస్సన్ ప్లానింగ్, డైరీలను పరిశీలించారు. అనంతరం ఎంఈఓ త్రినాథరావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పిస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. గోరుముద్ద పథకం మెనూ కచ్చితంగా అమలు చేయాలని కోరారు.

నేడు సీఎం జగన్ పుట్టినరోజు వేడుకలు

రాజాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలు రాజాంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం వైభవంగా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కంబాల జోగులు తెలిపారు. ఉదయం 9 గంటలకు కేక్ కటింగ్ ఉంటుందన్నారు. అనంతరం బ్లడ్ డొనేషన్ క్యాంపు, పేదలకు పండ్లు, రొట్టెల పంపిణీ కార్యక్రమం ఉంటుందని వివరించారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

సన్‌రైజ్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం

రాజాం పట్టణంలో సన్‌రైజ్ ఆస్పత్రిలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బర్త్‌డే వేడుకలను పురస్కరించుకుని గురువారం ఉదయం 10 గంటలకు మెగా రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎండీ డాక్టర్ తలే రాజేష్, మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య తెలిపారు. పార్టీ కార్యకర్తలు, అభిమానులు, యువత పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

● మళ్లీ జగనే సీఎం కావాలి

సంక్షేమ పథకాలు నిరంతరాయంగా కొనసాగాలన్నా.. రాష్ట్రం మరింత అభివృద్ధి చెందాలన్నా.. మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆకాంక్ష వ్యక్తం చేశారు. బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు గ్రామ సచివాలయాల పరిధిలో బుధవారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక సచివాలయాల వద్ద అధికారులతో కలిసి సంక్షేమ పథకాల డ్యాష్‌బోర్డులను ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఈ రాష్ట్రానికి మళ్లీ జగనే ఎందుకు ముఖ్యమంత్రి కావాలో వివరించారు. సంక్షేమ పాలన అందిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని ప్రతి ఒక్కరూ ఆశీర్వదించాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్



తెర్లాం: ఆమిటిలో ప్రభుత్వ పథకాల డ్యాష్ బోర్డును ఆవిష్కరిస్తున్న మండల అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు



రేగిడి: ఉంగరాడలో డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, తదితరులు



సంతకవిటి: తమరాంలో సంక్షేమ లబ్ధిని తెలిపే డిజిటల్ బోర్డును ఆవిష్కరిస్తున్న సర్పంచ్ ఎ.గౌరినాయుడు, కార్యదర్శి ఎం.ఎల్ నాయుడు



వంగర: మరువాడలో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, పార్టీ కన్వీనర్ కరణం సుదర్శనరావు



బాడంగి: కోడూరు–2 సచివాయం వద్ద సంక్షేమ పథకాల బోర్డును ఏర్పాటుచేస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

సకాలంలో రుణాలు చెల్లించాలి



ఖండ్యాంలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఏపీఎం గోవిందరావు

రేగిడి: బ్యాంకుల నుంచి మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించాలని వైఎస్సార్ క్రాంతి పథం రాజాం ఏరియా కోఆర్డినేటర్, ఏపీఎం బి.గోవిందరావు సూచించారు. ఖండ్యాం, వెంకటాపురం, కొమెర తదితర గ్రామాల్లోని మహిళా సంఘాలతో బుధవారం సమావేశం నిర్వహించారు. సంఘాల వారీగా తీసుకున్న రుణాలు, రికవరీలపై ఆరాతీశారు. స్త్రీనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అక్రమాలకు పాల్పడేవారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. సంఘ సభ్యులకు చేరాల్సిన రుణం ఇవ్వకుండా బదలాయింపులు చేస్తే సీఎఫ్‌లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సీసీలు, సీఎఫ్‌లు, వీఓలు పాల్గొన్నారు.

లక్ష పుష్పార్చన

విజయనగరం టౌన్: సుబ్రహ్మణ్య స్వామి షష్ఠి మహోత్సవాల్లో భాగంగా స్థానిక పూల్‌బాగ్‌లోని వల్లీదేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో బుధవారం ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు, స్వామి ఉపాసకులు కర్రి వెంకటరమణ సిద్ధాంతి ఆధ్వర్యంలో దేవతామూర్తులకు లక్ష పుష్పార్చన సేవ నిర్వహించారు. వందలాది మంది భక్తులు వేకువజాము నుంచి ఆలయానికి చేరుకుని స్వామివారికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు.

వైభవంగా సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం



సుబ్రహ్మణ్య స్వామి కల్యాణం చేస్తున్న అర్చకులు

బొబ్బిలి: గొల్లపల్లి దాడితల్లి అమ్మవారి దేవాలయం వద్ద సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి షష్ఠి పూజలు ఘనంగా చేపడుతున్నారు. ఇందులో భాగంగా వేదపండితులు బుధవారం స్వామివారి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. పండిప్రోలు మణికుమార్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పరిసర ప్రాంతాలకు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.

ఆరోగ్య ప్రదాత జగనన్న



బుచ్చింపేటలో ఆరోగ్యశ్రీ కార్డులు అందిస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

● ఎమ్మెల్యే కంబాల జోగులు

రాజాం: వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద వైద్యఖర్చుల పరిమితిని రూ.25 లక్షలకు పెంచి ఆరోగ్య ప్రధాతగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఖ్యాతి గడించారని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. మున్సిపాలిటీ పరిధి బుచ్చింపేటలో ఆరోగ్యశ్రీ కొత్త కార్డులను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. గతంలో ఏ ప్రభుత్వం అమలుచేయని విధంగా ఆరోగ్యశ్రీ కింద పేదలకు మెరుగైన వైద్యసేవలను అందిస్తోందన్నారు. కోవిడ్ వైద్యాన్ని కూడా ఆరోగ్యశ్రీలో కలపడం ద్వారా ఎంతోమంది ప్రజలు ప్రాణాలను కాపాడిందన్నారు. ప్రతీ మండలానికి రెండు పీహెచ్‌సీలు ఏర్పాటు చేయడంతో పాటు, ఏరియా, సామాజిక ఆస్పత్రుల స్థాయి పెంచడం, పూర్తి స్థాయిలో వైద్య సిబ్బందిని నియమించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ తలే రాజేష్, రాజాం పట్టణ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, కోరాడ రామినాయుడు, పిట్టా జగదీష్, పాలవలస గోపి, గోకవలస బాబూరావు, నమ్మి పార్వతీరావు, దూబ గోపాలం, ఇన్‌చార్జ్ కమిషనర్ ఎంవీ నాగరాజు, ఏఈ రవికుమార్, డోలపేట అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.

3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు



కొత్తవలసలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ రేనుకాసాయి



రేగిడి: రేగిడిలో రైతులతో మాట్లాడుతున్న ఏఓ మురళీకృష్ణ

రేగిడి: మండలంలో ఇప్పటివరకూ 3వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందని వ్యవసాయశాఖ అధికారి జి.మురళీకృష్ణ తెలిపారు. మండలంలోని కోడిశ, కందిశ, సరసనాపల్లి, వెంకమపేట, తునివాడ, రేగిడి తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి ధాన్యం కొనుగోలుపై రైతులతో మాట్లాడారు. ఈ–క్రాప్ నమోదు చేసినవారందరికీ సకాలంలో ట్రక్కు సీట్లు ఇస్తున్నామన్నారు. రెండు రోజుల వ్యవధిలో విక్రయించిన ధాన్యం నగదు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని తెలిపారు. దళారీలను నమ్మొద్దని హితవు పలికారు. మిల్లులకు తరలించిన ధాన్యాన్ని సకాలంలో అన్‌లోడ్ అయ్యేలా చూడాలని, రైతుల బిల్లుల చెల్లింపు ప్రాసెస్ పెండింగ్ లేకుండా చూడాలని సిబ్బందికి సూచించారు.

ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలించాలి

రాజాం: ట్రక్కు సీట్లు పొందిన రైతులు తమ వద్ద ఉన్న ధాన్యాన్ని సకాలంలో తమకు కేటాయించిన ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు తరలించాలని మండల వ్యవసాయశాఖ అధికారి ఎ.రేనుకాసాయి సూచించారు. మండలంలోని మారేడుబాక, బొమ్మినాయుడువలస, కొఠారిపురం, కొత్తవలస గ్రామాల్లో బుధవారం పర్యటించారు. ధాన్యం విక్రయాలు జరుపుతున్న రైతులతో మాట్లాడారు. రైతులకు ప్రభుత్వం మద్దతుధర కల్పిస్తుందని, దళారీలను ఆశ్రయించవద్దని సూచించారు.

పకడ్బందీగా పరీక్షల నిర్వహణ

● ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ



ప్రభుత్వ బాలుర కళాశాలలో సౌకర్యాలపై ఆరా తీస్తున్న ఆర్‌ఐఓ ఆదినారాయణ

రాజాం సిటీ: జిల్లాలో ఈ ఏడాది ఇంటర్మీడియెట్ పరీక్షలు నిర్వహణ పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ బాలురు, బాలికలు, జీసీఎస్‌ఆర్, గాయత్రి, వేదగాయత్రి, ఆదిత్య కళాశాలలను బుధవారం ఆయన పరిశీలించారు. పరీక్షలకు నిర్వహణకు అవసరమైన వసతులపై ఆరాతీశారు. పరీక్షల నిర్వహణపై ఆయా కళాశాలల యాజమాన్యాలకు పలు సూచనలు చేశారు. తాగునీరు, మరుగుదొడ్లు పూర్తిస్థాయిలో ఉండాలన్నారు. అలాగే ప్రతి గదిలో సీసీ కెమేరా ఏర్పాటు చేయాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉత్తీర్ణత శాతం పెంపుదలకు అధ్యాపకులు కృషిచేయాలని సూచించారు. జిల్లా 78 కేంద్రాల్లో పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు పరిశీలిస్తున్నామని అన్నారు.

నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యం

వంగర: ఇంటర్మీడియెట్‌లో నూరు శాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా అధ్యాపకులు కృషిచేయాలని ఆర్‌ఐఓ ఎం.ఆదినారాయణ సూచించారు. మద్దువలస ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యాప్రమాణాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణకు గాను కళాశాలలో ఉన్న వసతులపై ఆరాతీశారు. భవనాలు, గదులు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర వసతులను పరిశీలించారు.

అర్హులందరికీ 'ఉపాధి'



వంగర: మాట్లాడుతున్న ఎంపీపీ సురేష్‌ముఖర్జీ

వంగర: అర్హులందరికీ ఉపాధిహామీ పథకం కింద పనులు కల్పించాలని ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ మేట్లకు బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న పేదలందరికీ వంద రోజులు పని కల్పించేందుకు కృషిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీడీ శ్రీనివాసరావు, ఏపీఎం ఎం.సత్యవతి పాల్గొన్నారు.

ఉపాధిహామీ మేట్లకు శిక్షణ

బొబ్బిలి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధిహామీ పథకం పనులపై ఉపాధిహామీ మేట్లకు బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ శంబంగి లక్ష్మీవేణుగోపాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని మేట్లకు పలు సూచనలు చేశారు. వేతదారులతో ఏవిధంగా పనులు చేయించాలి, కొలతలు, మస్తర్లు వేయడంపై దిశానిర్దేశం చేశారు. పేద పేద ప్రజలు జీవనోపాధి కోసం ఇతర ప్రాంతాలు వెళ్లకుండా నివారించడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యమని, వేతనదారులకు మేలు జరిగేలా పనులు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంకిలి శాంతకుమారి, వైఎస్సార్‌సీపీ నాయకుడు శంబంగి వేణుగోపాలనాయుడు, ఎంపీడీఓ లక్ష్మీపతిరాజు, తదితరులు పాల్గొన్నారు.

ప్రతీ గ్రామంలో ఉపాధి పనులు

రేగిడి: ప్రతీ గ్రామంలో ఉపాధిహామీ పనులు జరిగేలా చూడాలని ఏపీఓ ఎస్.హరనాథరావు సూచించారు. మండల కేంద్రంలోని ఉపాధికార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్‌లతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఖరీఫ్ పనులు పూర్తవుతున్న నేపథ్యంలో ప్రతీ గ్రామంలో వేతనదారులకు పనులు కల్పించాలన్నారు. ఈ ఏడాది వలసలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.